## క్లుప్తంగా

### సైబర్ నేరాలపై అవగాహన

మణుగూరురూరల్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, మాదకద్రవ్యాలను నిర్మూలనకు పాటుపడాలని మణుగూరు ఏఎస్సై శాంతి సూచించారు. మణుగూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ.. నేటి ఆధునిక సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువైపోతున్నాయని, ఈజీ మనీకి అలవాటు పడి ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. అప్రమత్తంగా ఉంటూ తమ వివరాలను కానీ, బ్యాంక్ ఖాతా ఓటీపీలను ఎవరికీ చెప్పొద్దని సూచించారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను చీకటిమయం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చిన్నారావు, సిబ్బంది బి నిరోష, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

### నిత్యావసరాల వితరణ


నిత్యావసరాలు, స్నాక్స్ అందజేస్తున్న ట్రస్ట్ బాధ్యులు

మణుగూరురూరల్: మండలంలోని సంతోష్‌నగర్‌లో ఉన్న శ్రీ విద్యాభ్యాస (బాలవెలుగు పాఠశాల) ఎడ్యుకేషన్ విద్యార్థుల కోసం శ్రీనివాసన్ మునుస్వామి రాధా అద్దంకి ట్రస్ట్ వారు సహాయం అందించి ఔదార్యం చాటుకున్నారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల కోసం ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ శరత్ అద్దంకి సహకారంతో సుమారు రూ.7.70లక్షల విలువ చేసే బియ్యం, నిత్యావసర సరుకులు, పిల్లల స్నాక్స్‌ను ఆరు నెలలకు సరిపడా అందించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు బి.జగన్మోహన్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు ఉల్లెందుల సురేష్, తూముల శ్రీనివాస్, దుర్గ్యాల సుధాకర్, జంపాల శ్రీనివాస్, నాసర్ పాషా, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మరమ్మతులు చేస్తాం

చండ్రుగొండ: ఆశ్రమ పాఠశాల భవన సముదాయానికి మరమ్మతులు చేస్తామని, ఈ దిశగా ప్రతిపాదనలు చేయనున్నామని ఐటీడీఏ ఈఈ చంద్రశేఖర్ తెలిపారు. మండలకేంద్రం చండ్రుగొండలోని ఆశ్రమ పాఠశాల భవనం పైఅంతస్తు శిథిలావస్థకు చేరి స్లాబు పెచ్చులుగా ఊడి పడుతోంది. ఇటీవల ఐటీడీఏ పీఓ బి.రాహులు పాఠశాలను సందర్శించిన విషయం విదితమే. పీఓ ఆదేశాల మేరకు ఈఈ చంద్రశేఖర్ గురువారం పాఠశాలను సందర్శించి పరిశీలించారు. ఆయన వెంట డీఈ బాపనయ్య, ఏఈ సుబ్బరాజు పాల్గొన్నారు.

### పదోన్నతులు ఇవ్వాలి

మణుగూరుటౌన్: డీ–గ్రేడ్ టెస్ట్ ఫెయిల్ చేసిన ఆపరేటర్లందరికీ ప్రమోషన్ ఇవ్వాల్సిందిగా ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ గురువారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐటీయూసీ గెలిచిన తర్వాత 100 ఈపీ ఆపరేటర్ పోస్టులు అవసరమని మేనేజ్‌మెంట్‌ని ఒప్పించి ఆపరేటర్ పోస్టులు భర్తీ చేయించామన్నారు. అందులో మొదటి గ్రూప్.. ట్రైనింగ్ పూర్తి చేసుకుని డీ–గ్రేడ్ ప్రమోషన్‌కి సిద్ధంగా ఉన్నారని అలాంటి తరుణంలో గ్రేడ్ టెస్ట్‌కి వెళ్లిన ఈపి ఆపరేటర్లకి లేనిపోని కొర్రీలు పెట్టి కొందరిని ఫెయిల్ చేసిందని అన్నారు. వారిని వెంటనే పాస్ చేసి ప్రమోషన్ ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. నాయకులు నర్సయ్య, మేకల ఈశ్వర్‌రావు, పుల్లారావు, ఆవుల నాగరాజు, ఆదర్ల సురేందర్, సురేంద్రరావు, గంగాధర్‌రావు, శనిగరపు కుమారస్వామి తదితరులు ఉన్నారు.

### రూ.10 లక్షలకు పెంచాలి

చండ్రుగొండ: ఎలక్ట్రీషియన్లకు ప్రమాద బీమా పథకం కింద ఇస్తున్న నగదును రూ.10 లక్షలకు పెంచాలని ఎలక్ట్రీషియన్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చండ్రుగొండలో గురువారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రీషియన్లు ఐక్యతగా ఉంటేనే సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి బాబ్జీ, మండల నాయకులు ఎస్‌కె.ఆసీఫ్, బాబురావు, మన్నెం వీరంద్ర ప్రసాద్, నజీర్, అహెమద్, ఆబీద్, హబీబ్, రమేష్, లక్ష్మణ్, వెంకటాచారి పాల్గొన్నారు.

### అర్చకుల సమస్యలు పరిష్కరించండి

దుమ్ముగూడెం: అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలి, ప్రతీ అర్చకుడికి ఐడీ కార్డులు అందచేయాలని అర్చకసంఘం జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల రాజగోపాల్‌చార్యులు డిమాండ్ చేశారు. అర్చక సంఘం రాష్ట్ర, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మంలోని దేవాదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ వీరాస్వామి, భద్రాచలం పరిశీలకులు వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నావజ్జుల ప్రసాద్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మరింగంటి భార్గవాచార్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పురాణం సుమన్ కుమార్ శర్మ, జిల్లా కోశాధికారి కౌతా ప్రసాద్ శాస్త్రి, సహాయ కార్యదర్శి పాడకంటి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నత్తే నయం


విద్యుత్ స్తంభాలకు కనెక్షన్ ఇస్తున్న సిబ్బంది

- అట్టహాసంగా ఆరంభమైన సెంట్రల్ లైటింగ్ పనులు
- ఏడాది దాటినా పూర్తికాని వైనం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు

**ములకలపల్లి మండల కేంద్రంలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులు నత్త నడకన కొనసాగుతున్నాయి. పనుల ఆరంభించి సంవత్సర కాలం గడిచినప్పటికీ ఏమాత్రం పురోగతి కానరావడం లేదు. హడావుడిగా ఆర్‌అండ్‌బీ పరిధిలోని నిర్మాణాలను తొలగించిన అధికారులు.. పనులు పూర్తి చేయడంలో మాత్రం తీవ్రనిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.**

ములకలపల్లి: ములకలపల్లి ప్రధాన సెంటర్‌లో 1,200 మీటర్ల మేర సెంట్రల్ లైటింగ్, డివైడర్, ఫోర్‌లైన్ బీటీ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.5.75 కోట్లు మంజూరయ్యాయి. నాటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు భూమిపూజ పనులను లాంఛనంగా ప్రారంభించారు.

ఇంతవరకూ బాగానే ఉన్నా, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొన్ని నెలలపాటు ఎటువంటి పనులు చేయలేదు. అటుపిమ్మట సుమారు ఏడాది క్రితం ఆర్‌అండ్‌బీ పరిధిలోగత రోడ్డుకిరువైపులా ఉన్న 50 అడుగులలోపు నిర్మాణాలను తొలగించే పనులు చేపట్టారు. హుటాహుటిన ఇళ్ల ముంగిళ్లలోని పందిళ్లు, రేకుల షెడ్లు, కాంక్రీట్‌లను పూర్తిగా తొలగించారు. ఈ క్రమంలో తాత్కాలిన మురుగు కాలువ కూడా పూడిపోయింది. నాటి నుంచి రోడ్డు పైనే మురుగునీరు పారుతూ దుర్గంధం వెదజల్లుతోంది. ఎలాగోలా పనులు మొదలయ్యాయి ఇక చురుగ్గా సాగుతాయనుకున్న స్థానికుల ఆశలు అడియాసలుగానే మిగిలాయి. పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదు.

**ఆగుతూ.. సాగుతూ..**

కొన్నాళ్ల తదపరి 45 అడుగుల హద్దుగా అధికారులు విద్యుత్ స్తంభాలు వేసి, చేతులు దులుపుకున్నారు. మరికొన్నాళ్లకు రోడ్డు కిరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న 'ఇంట్రా' పైప్‌లైన్‌ను ఇటీవలే మార్చి, కొత్తగా మరో పైపు లైను వేశారు. గత రెండు రోజులుగా నూతనంగా వేసిన స్తంభాలకు కనెక్షన్లు ఇస్తున్నారు. ఇక ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నీరందించే మిషన్ భగీరథ పైప్‌లైన్ సైతం నూతనంగా వేయాల్సి ఉంది.

**ప్రధాన పనుల జాడేది..?**

నిర్మాణ పనులు మొదలు పెట్టి ఏడాది దాటినా రోడ్డు వెడల్పు, బీటీ రోడ్డు నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ పనులు నేటికీ మొదలే కాలేదు. విద్యుత్ లైన్ల మార్పు, తాగునీటి పైపుల ఏర్పాటు, చెట్లు తొలగింపు తదితర పనులకు సంబంధించి ప్రభుత్వ అనుమతులు, నిధుల మంజూరీకే ఏడాది కాలం సరిపోయింది. ఈక్రమంలో మిగిలిన పనులన్నీ పూర్తయ్యేలోగా ఎన్నాళ్లు పడుతుందోనని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సజావుగా పనులు సాగేలా చూడాలని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులను కోరుతున్నారు.

**ఇబ్బందులు పడుతున్నాం..**

సెంట్రల్ పనులంటూ ఇళ్ల ముంగిట తవ్వి గోతులమయంగా మార్చారు. కనీసం నిలువ నీడ కూడా లేకుండా పోయింది. ఏడాది దాటినా అతీగతీలేదు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలి.

– బిక్కుమళ్ల సుధాకర్, వ్యాపారి

**మూడు నెలల్లో పూర్తి చేస్తాం..**

అనివార్య కారణాల వల్ల పనుల్లో జాప్యం జరిగింది. ప్రధాన పనులు మొదలు పెట్టేందుకు సర్వం సిద్ధం చేశాం. మూడు నెలల్లో ఖచ్చితంగా పనులన్నీ పూర్తి చేస్తాం.

– లఖన్ నాయక్, ఆర్‌అండ్‌బీ ఏఈ

# 'ఎస్‌ఆర్‌ఆర్‌పీ' కింద ప్రతిపాదనలు


దమ్మపేట: గండుగులపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గంలోని పలు రహదారులను ఎస్‌ఆర్‌ఆర్ (స్పెషల్ రిపేర్ రోడ్డు) ప్రోగ్రాం, హైబ్రీడ్ యాన్విటి మోడల్ పథకం కింద ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. గురువారం ఆయనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం త్వరలో తీసుకురానున్న ఎస్‌ఆర్‌ఆర్‌పీ పథకానికి సంబంధించి నియోజవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలాల్లోని ప్రధానమైన 40 రహదారులను ఆయా శాఖల ద్వారా గుర్తించి ప్రతిపాదనకు సిద్ధం చేశామని తెలిపారు. టెండర్ దక్కించుకున్న సంస్థలు ఆయా రహదారులను 15 ఏళ్లపాటు గుంతలు పూడ్చటం, దెబ్బతిన్న ప్రాంతాల్లో తిరిగి రోడ్లను నిర్మించడం, జంగిల్ కటింగ్‌తోపాటు ఇతర నిర్వహణ చేయాల్సి ఉంటుందని వివరించారు.

**కార్యకర్తలకు దిశానిర్దేశం**

దమ్మపేట: కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, నియమాలకు కట్టుబడి, ఎటువంటి వర్గ భేదాలకు తావులేకుండా అందరూ సమైక్యంగా పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పార్టీ ముఖ్య నాయకులకు దిశా నిర్దేశం చేశారు. గురువారం మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ములకలపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపైనే ఉందని పేర్కొన్నారు.

# అసంక్రమిత వ్యాధులపై అవగాహన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం అసంక్రమిత వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో హెల్త్ ఎడ్యుకేటర్ పరంగిని మాట్లాడుతూ.. 30 ఏళ్లు పైబడిన ప్రతీ ఒక్కరు బీపీ, షుగర్ వ్యాధులకు పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉంటాయని, ప్రతీ నెల పరీక్షలు చేసి మందులను అందజేయడం జరుగుతుందన్నారు. మందులను క్రమం తప్పకుండా వాడుతూ.. వైద్యుల సూచనల మేరకు ఆహారపు అలవాట్లను మార్చుకుంటూ అసంక్రమిత వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, రామాలక్ష్మి, రమణ, ఎంఎల్‌హెచ్‌పీ మనీషా తదితరులు పాల్గొన్నారు.

# నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి


నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అశ్వారావుపేటరూరల్: గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని నారంవారిగూడెం, నారంవారిగూడెం కాలనీ, పాత అల్లిగూడెం, పేరాయిగూడెం, అశ్వారావుపేటలోని నర్సరీలు, ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. నర్సరీల్లో ఉన్న మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలని సూచించారు. ఉపాధి పనులను నిబంధనల ప్రకారం చేయాలని, కూలీల హాజరు శాతం పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఈజీఎస్ ఏపీఓ రామచంద్రరావు, కార్యదర్శులు ఉన్నారు.

# టిప్పర్ ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా ఈశ్వర్‌రెడ్డి


ఎన్నికైన నూతన కార్యవర్గం..

మణుగూరుటౌన్: 14 టైర్స్ టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడి ఎంపికపై గత కొన్ని రోజులుగా రెండు వర్గాలుగా మధ్య కొనసాగిన వివాదానికి చెక్ పడింది. అధ్యక్ష పదవికి గురువారం ఎట్టకేలకు ఎన్నిక జరిగింది. 64 మంది టిప్పర్ ఓనర్లు ఉన్న అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా ఈశ్వర్‌రెడ్డి ఎన్నికయ్యారు. 41 మంది ఒకవర్గం వైపు అధ్యక్షుడిగా ఉన్న దుగ్గెంపూడి ఈశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తటపర్తి నాగభూషణం, కోశాధికారిగా తేపర్ల శాంత కుమార్, ఉపాధ్యక్షులు పితాని రామ సత్యనారాయణతో మరోఐదు గురు కమిటీ సభ్యులను బలపరుస్తూ కార్యాలయం వద్ద సంతకాలు చేశారు. దీంతో ఈశ్వర్‌రెడ్డి(కొత్త కమిటీ) ఎన్నిక సూత్రప్రాయమైంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు పీరినాకి నవీన్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తరుణ్ రెడ్డి, ముఖ్య నాయకులు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిప్పర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పటాసులు కాల్చి సంబురాలు నిర్వహించి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రంజిత్‌సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానమే సరి..

దమ్మపేట: కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకురానున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్‌కు బదులుగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రం, దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'యుద్ధభేరి'పోస్టర్లను టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుక్కాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న సీపీఎస్ కంటే యూపీఎస్ విధానం వల్ల ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. యూపీఎస్‌ను వ్యతిరేకిస్తూ, మార్చి 2న హైదారాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న యుద్ధభేరి కార్యక్రమానికి, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై, జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి మండలాల సీపీఎస్ బాధ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ఆశ్రమంలో ధ్యాన మందిరం


సమావేశంలో హరినాథ్ విఠల్ గురు శిష్య బృందం..

బూర్గంపాడు: బూర్గంపాడులోని శ్రీరామ అవధూత ఆశ్రమ ప్రాంగణంలో ఆధ్యాత్మిక ధ్యాన మందిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహక కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ.. 40 ఏళ్ల క్రితం ఆశ్రమాన్ని శ్రీగురు హరినాథ విఠల్ నిర్మించగా.. ఆయన శిష్యబృందం ధ్యాన మందిరం నిర్మించినట్లు వెల్లడించారు. మందిరంలో 23వ తేదీన హరినాథ విఠల్ పంచలోహ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని, అదేరోజు కొసరాజు విజయలక్ష్మి ఆధ్వర్యాన యజ్ఞయాగాదులు, ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు.

### విద్యారంగాన్ని కాపాడాలి

భద్రాచలంటౌన్: విద్యాశాఖకు మంత్రిని వెంటనే నియమించి విద్యారంగాన్ని కాపాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కాంపాటి పృథ్వీ అన్నారు. భద్రాచలం జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విద్యార్థులు నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి మునిగల శివప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### సాయినాథుడికి పూజలు

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సాయినాథుడికి పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మణుగూరుకు చెందిన దొంతుల రాజశేఖర్–సంధ్యారాణి దంపతులు, లక్ష్మీతనూజ, మేదసాయిశ్రీలు అన్నదాన వితరణ చేశారు.

### క్రీడలతో స్నేహభావం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న తెల్లం సీతమ్మ

దుమ్ముగూడెం: క్రీడా పోటీల వల్ల యువతలో స్నేహభావం పెరుగుతుందని, దాని వల్ల మంచి సంబంధాలు ఏర్పడుతాయని మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ అన్నారు. గురువారం మండలంలోని ములకనపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆమె ప్రారంభించారు. మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు లంక అబ్బులు, శివాజీ, నరేంద్ర, జీపీ కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ అంతరాయం

దమ్మపేట: మండలంలోని మందలపల్లి, గట్టుగూడెం సబ్ స్టేషన్ల పరిధిలో నేడు(శుక్రవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు అశ్వారావుపేట ట్రాన్స్‌కో ఏడీఈ వెంకటరత్నం తెలిపారు. సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

### ఒలంపియాడ్‌లో సత్తా

దమ్మపేట: ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ పరీక్షల్లో దమ్మపేట సెయింట్ మేరీస్ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. ఈ నెల 9న ఒలంపియాడ్ పోటీ పరీక్షలను ఖమ్మంలో నిర్వహించారు. ఈ పోటీల్లో సెయింట్ మేరీస్ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని అడపా సాన్విక, 9వ తరగతి విద్యార్థి లోకేష్ వర్మలు వరుసగా 44, 42 రాష్ట్ర స్థాయి ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల కరస్పాండెంట్ సాజు సెబాస్టియన్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

### అధ్యాపకుడికి సన్మానం

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని జ్యోతిబాపూలే కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న రాజాపురం గ్రామానికి చెందిన దావా వేణుకు గురువారం ఘనంగా సన్మానించారు. ఆరు నెలల వ్యవధిలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతోపాటు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి వేణు డాక్టరేట్ పొందడం గర్వించతగిన విషయమని కళాశాల ప్రిన్స్‌పాల్ బురాన్ అన్నారు.

### ఉచిత వైద్యశిబిరం

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా సేవా సమితి, వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మండలంలోని గొల్లకొత్తూరులో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు శేషగిరి వైద్యశిబిరంలో సీజనల్ వ్యాధులతో పాటు బీపీ, షుగర్, వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు అందజేశారు. 56 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా.. భవానీ, అంకురాజు, లింగయ్య, రమేశ్, యూసఫ్ ఉన్నారు.

### మృతుల కుటుంబాలకు పరామర్శ

మణుగూరుటౌన్: మణుగూరుకు చెందిన ట్రాలీ ఆటో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మడతల సుబ్బారెడ్డి(48) బుధవారం అర్ధరాత్రి ఆదర్శ్‌నగర్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. అలాగే, ముత్యాలమ్మనగర్ సంతోష్‌నగర్‌కు చెందిన హమాలీ యాకూబ్‌రెడ్డి(51) గురువారం ఉదయం గుండెపోటుతో కన్నుమూశాడు. సీఐటీయూలో కీలకంగా వ్యవహరిస్తున్న వీరి మృతదేహాల వద్ద నాయకులు నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

### పోస్టర్ల ఆవిష్కరణ

ములకలపల్లి: ములకలపల్లిలోని ఉమా పృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్న శివరాత్రి వేడుకల పోస్టర్లను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం ఆవిష్కరించారు. గుండుగుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పోస్టర్ల ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో వేడుకలను జరుపుకోవాలన్నారు. అర్చకులు విస్సావఝ్జల సురేశ్ శర్మ, ఆలయకమిటీ అధ్యక్షుడు నరాటి ప్రసాద్, సభ్యులు పువ్వాల మంగపతి, బండి కొమరయ్య, గాడి తరుపతిరెడ్డి, వరుణ్, రాంబాబు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

### ఘనంగా సూర పాపయ్య జాతర


జాతరలోని పూజలకు హాజరైన ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

గుండాల: కుంజ వంశీయుల ఇలవేల్పు అయిన సూర పాపయ్య జాతర గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని శంభునిగూడెంకు చెందిన కుంజ వంశీయుల ఆధ్వర్యాన ఏటా నిర్వహించే ఈ జాతర బుధవారం మొదలైంది. ఈమేరకు గురువారం జోగుకు వెళ్లి గంగా స్నానం చేయించడంతో పాటు గుడిమెలుగు పండుగ నిర్వహించారు. శుక్రవారం భక్తులు మొక్కులు చెల్లించుకున్నాక గుట్టకు తరలించడంతో జాతర ముగియనుంది. కాగా, తలపతులు సూరయ్య, పాపయ్య, సరసయ్య, ముత్తయ్య, పెంటయ్య, నాగేశ్వారావు, పొట్టియ్య, నర్సయ్య, సత్యం, పాపయ్య, సూర్యం, చిన్న స్వామి, వెంకటయ్య, బుచ్చిరాములు ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పూజలు చేశారు. అలాగే, క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

### బీసీ వాదాన్ని బలపరచాలి

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్రంలో బీసీ వాదాన్ని బలపరుస్తూ బహుజన కులాల అభ్యర్థి పూల రవీందర్‌ను గెలిపించాలని మున్నూరు కాపు అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ కోరారు. బీసీ వాదాన్ని బలపరచాలని కోరుతూ చేస్తున్న పర్యటనలో భాగంగా గురువారం పట్టణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తమ్మళ్ళ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ రావాలంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ వాదాన్ని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హిందూ బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర పటేల్, హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత సతీష్ కుమార్ పటేల్, సామాజికవేత్త డాక్టర్ పరికపండ్ల అశోక్, భద్రాచలం శ్రీకృష్ణ దేవరాయ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పిన్నింటి రాజశేఖర్, బాపట్ల మురళి, పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వరలక్ష్మి సాయిరాం, గుమ్మలూరి శ్రీనివాసరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### నారాయణపురం సొసైటీలో విచారణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం సొసైటీ కార్యాలయంలో గురువారం డీసీఓ కార్యాలయ ఆడిటర్ రమేష్ విచారణ చేపట్టారు. సొసైటీలో కాంట్రాక్ట్ పద్ధతిపై శివగణేష్ విధులు నిర్వర్తించగా అక్రమాలకు పాల్పడ్డాడనే ఫిర్యాదులతో మూడేళ్ల క్రితం తొలగించారు. అయితే, తనను అకారణంగా తొలగించారని కలెక్టర్, డీసీఓకు ఆయన ఫిర్యాదు చేశాడు. ఈమేరకు విచారణ బాధ్యతలను ఆడిటర్ రమేష్‌కు అప్పగించగా గురువారం సొసైటీ కార్యాలయంలో ఖమ్మంపాడు, దబ్బతోగు, నారాయణపురం, కావడిగుండ్ల తదితరుల గ్రామాల రైతుల నుంచి వివరాలు సేకరించారు. పంటలు, ద్విచక్రవాహనాల రుణాలు ఇప్పిస్తానని శివగణేష్ నగదు వసూలు చేశాడని, చెల్లించిన నగదుకు రశీదులు ఇవ్వలేదని రైతులు లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. అతర్వాత సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావు, డైరెక్టర్ల నుంచి వివరాలు సేకరించారు.

### పీఎం చిత్రపటానికి పాలాభిషేకం


ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

దమ్మపేట: ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన రేఖా గుప్తాకు ఢిల్లీ ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలతో అభిషేకం చేశారు. గురువారం మండల కేంద్రం, దమ్మపేటలోని వాసవీ భవన్‌లో, స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించిన అనంతరం అందరికీ మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు దారా ప్రసాద్ మాట్లాడుతూ.. ఎంతో ప్రతిష్టాత్మకమైన దేశ రాజధాని ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆర్యవైశ్య మహిళ ఎంపిక కావడం తమకెంతో గర్వకారణం అని పేర్కొన్నారు. ఈ సీఎం ఎంపికలో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇచ్చిన పీఎం మోదీకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు మండవల్లి సురేష్, సభ్యులు మాడా లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, సాయిరాం, వినోద్, రాధకృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# బాలమేళా విద్యార్థులకు ఉపయుక్తం


చండ్రుగొండ: విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

చండ్రుగొండ: బాలమేళా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న మేధాశక్తి బయటకు వస్తుందని మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ అన్నారు. మండలంలోని రేపల్లెవాడలో పాఠశాల కాంప్లెక్స్ స్థాయి బాలమేళా కార్యక్రమం బుధవారం ఏర్పాటు చేశారు. పాఠ్యాంశాల వారిగా పారామీటర్ ఆధారంగా ప్రతిభచూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. కాంప్లెక్స్ స్థాయిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ప్రదర్శనే లక్ష్యంగా బాలమేళా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మణుగూరు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ బాపూజీనగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో జెడ్పీ ఉన్నత పాఠశాల బాలికల మణుగూరు కాంప్లెక్స్ స్థాయి ఎఫ్‌ఎల్‌ఎన్ బాలమేళా–2025 కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓతో పాటు ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, ఎంఈఓ స్వర్ణజ్యోతిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీడీఓ మాట్లాడారు. అనంతరం బాలమేళాలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంపీడీఓ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్రటరి ఈసం బ్రహ్మయ్య, కాంప్లెక్స్ పరిధి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.